సాక్షి
అనంతపురం
గురువారం । 27 । జూన్ । 2024



తగ్గిన చీనీ ధరలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



హౌసింగ్ పీడీగా శైలజ

గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా శైలజ నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గరిష్టం/కనిష్టం
36.4°/23.6°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసులు

అనంతపురం: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్ అన్నారు. జిల్లా ఎస్పీ గౌతమి శాలి ఆదేశాల మేరకు బుధవారం అనంతపురంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సుభాష్ రోడ్డు, సప్తగిరి సర్కిల్, వై జంక్షన్‌ల మీదుగా జెడ్పీ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికెళ్లి బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. మాదకద్రవ్యాలు రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐలు వి. రెడ్డప్ప, క్రాంతి కుమార్, ప్రతాప్ రెడ్డి, నారాయణ రెడ్డి, సెబ్ సీఐ యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 2,400 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు బుధవారం 2,400 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు జిల్లాకు చేరినట్లు ఏడీఏ ఎం.రవి తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా సరఫరా అయిన ఎరువులను ఆయన పరిశీలించారు. కోరమాండల్ కంపెనీకి చెందిన 878 మెట్రిక్ టన్నుల 20-20-0-13, 782 మెట్రిక్ టన్నుల 16-20-0-13, 740 మెట్రిక్ టన్నుల 10-26-26 రకం కాంప్లెక్స్ ఎరువులు సరఫరా అయినట్లు తెలిపారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జేడీఏ ఆదేశాల మేరకు ఆర్‌బీకేలు, సొసైటీలు, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు. మిగతావి కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు తెలిపారు.

గాలిమరలో మంటలు



కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం మండల పరిధిలోని ఉప్పొక గ్రామం వద్ద గ్రీన్‌కో కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓ గాలిమరలో బుధవారం మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. మంటలకు తోడు దట్టమైన పొగ కమ్ముకుంది. ఈ క్రమంలో కంపెనీ ప్రతినిధులపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాలి మర ప్రజలపై పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే జైలుకే



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ గౌతమిశాలి

యల్లనూరు: శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే జైలుకు పంపుతానని జిల్లా ఎస్పీ గౌతమి శాలి అన్నారు. బుధవారం యల్లనూరు పోలీసుస్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకం కావాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. రాత్రిపూట గస్తీలు తిరగాలన్నారు. కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐ వరకు ప్రజలతో కలిసిమెలిసి ఉంటూ మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితులను పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యంను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌పై నిఘా పెట్టాలన్నారు. చట్టాన్ని ఎవరైనా చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదన్నారు. ఎస్‌ఐ హేమాద్రి తదితరులున్నారు.

కలల కోర్సులో చేరాలనీ..

- ఇంజినీరింగ్‌లో చేరికపై విద్యార్థుల దృష్టి
- బ్రాంచులు, కళాశాలలపై తల్లిదండ్రులతో కలిసి ఆరా
- టెక్నాలజీపై పట్టు సాధించాలని నిపుణుల సూచన



జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల

అనంతపురం: లక్షలాది మంది విద్యార్థుల స్వప్నం ఇంజినీరింగ్ చదవడం. తెలుగు రాష్ట్రాల్లో ఇంజినీరింగ్ కోర్సులపై మక్కువ అంతా ఇంతా కాదు. తమ స్వప్నం సాకారం చేసుకోవడానికి విద్యార్థులు జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, ఏపీ ఈఏపీసెట్ వంటి పలు ప్రవేశ పరీక్షలు రాస్తుంటారు. ఆయా ప్రవేశ పరీక్షల ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. ఈ క్రమంలో ఏ కళాశాలలో చేరాలి, అందుబాటులో ఉన్న అనేక బ్రాంచుల్లో ఎందులో చేరితే మంచిది? ఏ కోర్సు చేస్తే భవిష్యత్తు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి? గత టాపర్లు క్రేజీగా భావించిన బ్రాంచ్‌లు, ఇటీవల కాలంలో బీటెక్‌లో బెస్ట్‌గా నిలుస్తున్న బ్రాంచ్‌లు ఏవి అనే విషయాలపై తల్లిదండ్రులు, విద్యార్థులు ఆరా తీస్తున్నారు.

మెకానికల్ ఇంజినీరింగ్..

మెకానికల్ ఇంజినీరింగ్‌కు ఎవర్ గ్రీన్ బ్రాంచ్‌గా పేరుంది. ద్విచక్ర వాహనాల నుంచి విమానాల తయారీ వరకు మెకానికల్ ఇంజినీర్ల పాత్ర కీలకం. ముఖ్యంగా యంత్రాలు, ఆటోమొబైల్స్, ఎలక్ట్రికల్ మోటార్లు, భారీ వాహనాల డిజైన్, తయారీ అనేది మెకానికల్ ఇంజినీర్లు లేకుండా సాధ్యం కాదు. నాలుగేళ్ల మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులో భాగంగా థర్మోడైనమిక్స్, మెషిన్ డ్రాయింగ్, ఇంజినీరింగ్ మెటీరియల్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్, మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, డిజైన్ ఆఫ్ మెషిన్ ఎలిమెంట్స్, డైనమిక్స్ ఆఫ్ మెషినరీ, హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ వంటి సబ్జెక్టులను అధ్యయనం చేస్తారు.

జాతీయ స్థాయిలో కెమికల్ ఇంజినీరింగ్‌కు డిమాండ్..

విద్యార్థులను ఆకట్టుకుంటున్న మరో బ్రాంచ్ కెమికల్ ఇంజినీరింగ్. కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమేటిక్స్ సమ్మిళితంగా కెమికల్ ఇంజినీరింగ్ ఉంటుంది. కెమికల్ ఇంజినీరింగ్‌లో పరిశోధనల కారణంగా నానో టెక్నాలజీ, బయో ఇంజినీరింగ్, బయో మాలిక్యులర్ ఇంజినీరింగ్, మెటీరియల్ ప్రాసెసింగ్ వంటి సరికొత్త విభాగాలు పుట్టుకొస్తున్నాయి. మానవ జీనోమ్ ప్రాజెక్ట్, జెనెటిక్ ఇంజినీరింగ్, డీఎన్ఏ సీక్వెన్సింగ్ వంటివి కెమికల్ ఇంజినీరింగ్‌లో విప్లవాత్మక మార్పులకు దారితీశాయి. ఎయిర్ పొల్యూషన్ కంట్రోల్, కెమికల్ ప్రాసెస్ ఇండస్ట్రీస్, ఎన్విరాన్‌మెంటల్ పొల్యూషన్ కంట్రోల్, సేఫ్టీ మేనేజ్‌మెంట్, ఫెర్టిలైజర్ టెక్నాలజీ వంటి అంశాలను విద్యార్థులు చదువుతారు.

ఆధునిక టెక్నాలజీపై పట్టుండాలి



ప్రస్తుతం పరిశ్రమల అవసరాల దృష్ట్యా సివిల్, సీఎస్ఈ, మెకానికల్, ఈసీఈ, ఎలక్ట్రికల్, కెమికల్ బ్రాంచ్‌లు ముందంజలో నిలుస్తున్న మాట వాస్తవమే. వీటిల్లో సర్టిఫికెట్ సొంతం చేసుకుంటే కొలువులు ఖాయం అనే అభిప్రాయముంది. అయితే, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఏ బ్రాంచ్ విద్యార్థులైనా ఆ బ్రాంచ్‌కు సంబంధించి ఆధునిక టెక్నాలజీపై పట్టు సాధించాలి. రానున్న మూడేళ్లలో ఆటోమేషన్ ప్రభావం అధికంగా ఉంటుందనే అంచనాల దృష్ట్యా.. ఇందుకు సంబంధించిన నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. 78 సంవత్సరాల ఘన చరిత గల జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏ బ్రాంచ్ చదివినా ఉద్యోగావకాశాలు దక్కుతున్నాయి.

– ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల

టాపర్ల గమ్యం సీఎస్ఈ ..

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్.. సీఎస్ఈగా సుపరిచితం. బీటెక్ ఔత్సాహిక విద్యార్థుల్లో ఎక్కువమంది సీఎస్ఈలో చేరడానికే ఆసక్తి చూపుతారు. ఈ బ్రాంచ్‌తో ఐటీ కొలువులు, ఆకర్షణీయ ప్యాకేజీలు లభిస్తాయనే నమ్మకమే కారణం. అందుకు తగ్గట్టుగానే క్యాంపస్ రిక్రూట్‌మెంట్లలో ఐటీ రంగ కంపెనీలు తొలుత సీఎస్ఈ విద్యార్థులకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. నాలుగేళ్ల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో ముఖ్యంగా కంప్యూటర్ ప్రోగ్రామింగ్, నెట్ వర్కింగ్, అల్గారిథమ్స్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, ప్రోగ్రామ్ డిజైన్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఆపరేటింగ్ సిస్టమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా బేస్, డేటా స్ట్రక్చర్స్, తదితర అంశాలను అధ్యయనం చేస్తారు.

క్రేజీ తగ్గని సివిల్ ఇంజినీరింగ్

కోర్ బ్రాంచ్‌లలో మరో ముఖ్యమైన బ్రాంచ్.. సివిల్ ఇంజినీరింగ్. రహదారులు, వంతెనలు, విమానాశ్రయాలు, హాస్పిటళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, గృహ నిర్మాణాలు, అపార్ట్‌మెంట్లు తదితర మౌలిక వసతుల ప్రాజెక్టులు అన్నింటికీ ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలన్నీ చూసేది సివిల్ ఇంజినీర్లే. సివిల్ ఇంజినీరింగ్ కోర్సులో ముఖ్యంగా సాలిడ్ మెకానిక్స్, హైడ్రాలిక్స్, స్ట్రక్చరల్ అనాలసిస్, సర్వేయింగ్, డిజైన్ ఆఫ్ ఆర్‌సీ స్ట్రక్చర్స్, డిజైన్ ఆఫ్ స్టీల్ స్ట్రక్చర్స్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజినీరింగ్, క్యాడ్ తదితర అంశాలను బోధిస్తారు. రియాలిటీ రంగం దూకుడు మీద ఉండడంతో సివిల్ ఇంజినీరింగ్ అభ్యర్థులకు డిమాండ్ పెరుగుతోంది.

ఈసీఈ అటు కోర్.. ఇటు ఐటీ

బీటెక్ ఔత్సాహిక విద్యార్థులకు రెండో ప్రాథమ్యంగా ఈసీఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్) నిలుస్తోంది. ఈ బ్రాంచ్‌లో ప్రధానంగా ఎలక్ట్రికల్ పరికరాలు, అనలాగ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్, శాటిలైట్ కమ్యూనికేషన్స్, మైక్రోవేవ్ ఇంజినీరింగ్, మైక్రో ప్రాసెసర్స్, మైక్రో కంట్రోలర్స్, ట్రాన్స్‌మీటర్, రిసీవర్, ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ పరికరాల తయారీ, యాంటెన్నా, కమ్యూనికేషన్స్ సిస్టమ్స్ గురించి అవగాహన కలిగిస్తారు. ఈ బ్రాంచ్‌లో చేరడం వల్ల కోర్ సెక్టార్స్‌తో పాటు సాఫ్ట్‌వేర్ రంగాల్లోనూ కొలువులు సొంతం చేసుకునే అవకాశం ఉంది. నవరత్న కంపెనీల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

ఎవర్‌గ్రీన్ కోర్సు ..ఈఈఈ

ఈఈఈ ద్వారా అటు ఎలక్ట్రికల్, ఇటు ఎలక్ట్రానిక్స్ రెండింటిపైనా పట్టు లభిస్తుంది. ఫలితంగా రెండు రంగాలకు చెందిన పరిశ్రమల్లో కొలువు దీరొచ్చు. అందుకే ఇంజినీరింగ్ విద్యార్థుల భవిష్యత్తుకు ఈ కోర్సు భరోసాగా నిలుస్తోంది. ఎలక్ట్రికల్ టెక్నాలజీ , మెషీన్స్, మోటార్లు, జనరేటర్లు, సర్క్యూట్ అనాలసిస్, పవర్ ఇంజినీరింగ్, తదితర అంశాలను ఇందులో చదువుతారు. ప్రభుత్వ పరంగా విద్యుత్ రంగంలో అమలవుతున్న పథకాలు, ప్రైవేట్ రంగంలో ఏర్పాటు అవుతున్న హైడల్ పవర్ ప్రాజెక్టుల కారణంగా రానున్న నాలుగేళ్లలో రెండు లక్షల మంది ఈఈఈ ఇంజినీర్ల అవసరం ఉంటుందని అంచనా.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ 'సప్లి'లో 41.03 శాతం ఉత్తీర్ణత

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 41.03 శాతం ఉత్తీర్ణత సాధించారు. బుధవారం సాయంత్రం విడుదలైన ఫలితాల్లో అనంతపురం జిల్లా రాష్ట్రస్థాయిలో 16వ స్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 7,821 మంది విద్యార్థులకు గాను 3,209 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,609 మంది విద్యార్థులకు గాను 736 మంది (45.75 శాతం), ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో 456 మందికి కేవలం 70 మంది(15.35 శాతం), వెల్ఫేర్ జూనియర్ కళాశాలల్లో 81 మందికి 66 మంది (81.48 శాతం), కేజీబీవీల్లో 353 మంది విద్యార్థినులకు 204 మంది (57.79 శాతం), ఏపీ మోడల్ స్కూళ్లల్లో 339 మంది విద్యార్థులకు గాను 163 మంది (48.08 శాతం), ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో 4,983 మందికి గానూ 1,970 మంది (39.53 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

- ఫలితాల పరంగా కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల 98.77 శాతం ఉత్తీర్ణతతో మొదటిస్థానంలో నిలవగా, అనంతపురం నగరంలోని బాలుర జూనియర్ కళాశాల 18.10 శాతం ఉత్తీర్ణతతో చివరిస్థానంలో నిలిచింది. అలాగే వెల్ఫేర్ కళాశాలల్లో కురుగుంట ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించి మొదటిస్థానంలో నిలవగా, ఏపీటీడబ్ల్యూఆర్ బాలుర కళాశాల 45.83 శాతంతో చివరిస్థానంలో నిలిచింది. కేజీబీవీలకు సంబంధించి కూడేరు కేజీబీవీ (ఒకేషనల్) వంద శాతం ఉత్తీర్ణత సాధించి మొదటిస్థానంలో నిలవగా, యల్లనూరు కేజీబీవీ 11.54 శాతం ఉత్తీర్ణతతో చివరిస్థానంతో సరిపెట్టుకుంది. మోడల్ స్కూళ్లకు సంబంధించి 76.47 శాతం ఉత్తీర్ణతతో కణేకల్లు మోడల్‌స్కూల్ ప్రథమ స్థానంలో నిలవగా, 9.09 శాతం ఉత్తీర్ణతతో యల్లనూరు మోడల్ స్కూల్ చివరిస్థానంలో నిలిచింది.

అనుష్కదేవికి 468 మార్కులు



ఫలితాల్లో అనంతపురం నగరానికి చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయిలో సత్తా చాటింది. ఎంపీసీ విభాగంలో వోలేటి అనుష్కదేవి 470 మార్కులకు 468 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఇంగ్లిష్ పేపర్-1, సంస్కృతం పేపర్-1లో ఒక్కో మార్కు తగ్గింది. తక్కిన అన్ని సబ్జెక్టుల్లోనూ వంద శాతం ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించుకుంది. అనుష్కదేవి తల్లి కవిత గృహిణి కాగా, తండ్రి గంగాధర్ ప్రైవేట్ ఉద్యోగి. తమ కుమార్తె రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

అట్టడుగు వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య

- విద్యాపథకాలు వందశాతం దరిచేర్చాలి
- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జెడ్పీ సీఈఓ నిదియాదేవి

అనంతపురం అర్బన్: 'అట్టడుగు వర్గాలకు చెందిన కుటుంబాల్లోని పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలి. ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యా పథకాలు వారి దరిచేర్చినప్పుడే మంచి ఫలితం వస్తుంది. ఆ దిశగా విద్యా అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. ముఖ్యంగా గురుకుల పాఠశాలల్లో అర్హులైన వారికే ప్రవేశం కల్పించాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యా సంబంధిత అంశాలపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విద్యాశాఖ, సమగ్ర శిక్ష, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల కంటే గురుకుల పాఠశాలలు, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తారన్నారు. వసతి కూడా అక్కడే ఉండడం ఇందుకు కారణమన్నారు. ప్రధానంగా అనాథలు, నిరుపేదలు, ఇతర అట్టడుగు వర్గాల వారిని ఈ విద్యాలయాలు ఎంతగానో ఆదుకుంటాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అర్హులైన వారికే గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని చెప్పారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మిగిలిపోయిన సీట్లను అర్హులైన వారికి కేటాయించాలని చెప్పారు.

సమన్వయ కమిటీ ఏర్పాటు

గురుకులాల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం సమన్వయ కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ సీఈఓ వైభోమ్ నిదియాదేవి నేతృత్వంలోని సమన్వయ కమిటీలో జిల్లా విద్యాశాఖ అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ, ఇతర సంక్షేమ శాఖల అధికారులు ఉంటారు. గురుకుల పాఠశాలల్లో మిగిలిపోయిన సీట్లకు అర్హులను ఎంపిక చేయడంతో పాటు ప్రతి నెలా సమావేశమై ప్రగతిని సమీక్షించుకోవాలని కమిటీ సభ్యులకు కలెక్టర్ సూచించారు.

మండల కేంద్రంలోనే అర్జీలు తీసుకోవాలి

గురుకుల పాఠశాలల్లో సీటు కోరుతూ అర్జీదారులు జిల్లా కేంద్రానికి రావాల్సి అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. మండల కేంద్రాల్లోనే అధికారులు అర్జీలు తీసుకుని సమన్వయ కమిటీకి పంపించాలన్నారు. అర్జీలను కమిటీ పరిశీలించి 24 గంటల్లోగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థి కిట్లపై జెడ్పీ సీఈఓ, సమగ్ర శిక్ష ఏపీసీ వైభోమ్ నిదియాదేవి, జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడిని బలిగొన్న డయేరియా



డయేరియా బాధితులతో నిండిపోయిన ఉరవకొండ ఆసుపత్రి (ఇన్‌సెట్‌లో) నాగేంద్ర(ఫైల్)

ఉరవకొండ: జిల్లాలో డయేరియా మరణాలు ఆగడం లేదు. రెండు రోజుల క్రితం పామిడి మండలంలోని రామగిరి ఎగువతండా గ్రామానికి చెందిన రేణుక (22) డయేరియాతో మృతి చెందింది. ఇదే గ్రామానికి చెందిన పెద్దమ్మ (60) వ్యాధి బారిన పడి 5 రోజుల క్రితం కన్నుమూసింది. ఈ రెండు ఘటనలు మరువకమునుపే తాజాగా బుధవారం ఉరవకొండలో ఓ వృద్ధుడు డయేరియాతో మృతి చెందాడు. ఉరవకొండ మండలం చిన్నముస్టూరు గ్రామానికి చెందిన కురుబ నాగేంద్ర (75) స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. రెండు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న నాగేంద్రను బుధవారం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబసభ్యులు తీసుకురాగా, చికిత్స ఫలించక ఆయన కన్నుమూశాడు.

వారం రోజుల్లోనే 50కి పైగా కేసులు..

ఉరవకొండతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో డయేరియా విజృంభిస్తోంది. వారం రోజుల వ్యవధిలోనే 50 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారు. డయేరియా వ్యాధిగ్రస్తులతో ఉరవకొండ ఆసుపత్రి కిటకిటలాడుతోంది. రోజూ ఐదుగురి నుంచి ఆరుగురు డిశార్జ్ అవుతున్నా, కొత్త కేసులు 10 వరకూ నమోదవుతుండడం ఆందోళన కల్గిస్తోంది.

గురుకులంలో డయేరియా కలకలం

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో డయేరియా కలకలం రేపింది. బుధవారం ఒక్క రోజే సుమారు 25 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రిన్సిపాల్ ఉషారాణి వెంటనే బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, వైద్య సిబ్బందిని పిలిపించి విద్యార్థినులకు చికిత్సలు చేయించారు. సెలవుల కారణంగా సుమారు 45 రోజులు గురుకుల పాఠశాలను మూసేశారు. తిరిగి తెరిచిన అనంతరం నీటి ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో ఎక్కువ రోజులు నిల్వ ఉన్న నీటిని తాగి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, డీసీఓ మురళీకృష్ణ, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ భారతి అక్కడకు చేరుకొని విచారించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినుల తల్లిదండ్రులు ఎవరూ ఆందోళన చెందవద్దని, మరో రెండు రోజులు గురుకులంలో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం విద్యార్థినులు కోలుకుంటున్నారని తెలిపారు.

జీజీహెచ్‌లో డయేరియా వార్డు

అనంతపురం మెడికల్: డయేరియా బాధితుల కోసం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. 15 పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు తెలిపారు. నలుగురు ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సేవలందిస్తుందన్నారు.

రామగిరి ఎగువతండాలో వైద్య శిబిరం

పామిడి: డయేరియా ప్రబలిన నేపథ్యంలో మండలంలోని రామగిరి ఎగువతండాలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, డీఐఓ డాక్టర్ యుగంధర్, ఎపిడమిక్ టీమ్ వేమారెడ్డి, బలరామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓఆర్డీ బీవీ శశికళ, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం..అధైర్యపడొద్దు

- బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నేత ఆలూరి సాంబశివారెడ్డి భరోసా
- తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి



బాధితురాలిని పరామర్శిస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి, వీరాంజనేయులు తదితరులు

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్య పడొద్దని ఆ పార్టీ జిల్లా నేత ఆలూరి సాంబశివారెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన పార్టీ శింగనమల నియోజకవర్గ నాయకుడు వీరాంజనేయులుతో కలసి బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు గ్రామంలో ఇటీవల టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆదిలక్ష్మి, ఆమె కుమారుడు కిరణ్‌కుమార్ రెడ్డిలను పరామర్శించారు. వారికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ కార్యకర్తలు తమ ఇంటి ముందుకు వచ్చి అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు వేటకొడవలితో దాడి చేశారని బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలెవరూ అధైర్య పడొద్దని, పార్టీ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు దాడులకు పాల్పడడం శోచనీయమన్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు రేపొద్దని హితవు పలికారు. బాధితులను పరామర్శించిన వారిలో బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, దయ్యాలకుంటపల్లి ఎంపీటీసీ సభ్యుడు శివారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కొర్రపాడు భాస్కర్ రెడ్డి, రాధా మనోహర్‌రెడ్డి, పూల నారాయణ స్వామి, ముత్యాలశీన, విష్ణుతేజ్ రెడ్డి, రంగా, కాటమయ్య, గంగరాజు, లక్ష్మీ నారాయణ, నాగరాజు, రామ్మోహన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

- ఆర్ఎం సుమంత్.ఆర్.ఆదోని

ఉరవకొండ: ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ డిపోల పరిధిలో కారుణ్య నియమకాల కింద 89 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు ఆర్టీసీ ఆర్ఎం సుమంత్.ఆర్.ఆదోని తెలిపారు. బుధవారం ఉరవకొండ ఆర్టీసీ డిపోను ఆయన తనిఖీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతపురం జిల్లాలోని 7 ఆర్టీసీ డిపోల పరిధిలో 491 సర్వీసులు నడుస్తున్నాయన్నారు. ఈ క్రమంలో జిల్లాకు కొత్తగా 31 సర్వీసులు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో 11 ఆర్టీసీ, 20 అద్దె బస్సులు ఉన్నాయన్నారు. జిల్లాకు మరో 40 ఆర్టీసీ, 30 హైయ్యర్ బస్సుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే ఉరవకొండ, గుంతకల్లు ఆర్టీసీ డిపోలకు గ్యారేజీ యార్డులు మంజూరైనట్లు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ఇందన పొదుపుపై జిల్లా వ్యాప్తంగా 240 మంది డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.2023–24 సంవత్సరానికిగాను నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించిన సిబ్బందికి అవార్డులు, నగదు ప్రోత్సహకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ డీఎం బాలాజీదయాళ్, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డపారతో కొడుకు దాడి... తండ్రి మృతి

కూడేరు: గడ్డపారతో కొడుకు దాడి చేయడంతో తండ్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం కమ్మూరుకు చెందిన బోయ చిన్న ఆంజనేయులు(70)లకు భార్య శాంతమ్మ, కుమారుడు తిరుపాలు, కూతురు ఉమాదేవి ఉన్నారు. కొన్నేళ్లుగా మతి స్థిమితం లేక బాధపడుతున్న ఆంజనేయులు కుమారుడిని ఎప్పుడు తిడుతూ ఇతరుల వద్ద చెడుగా చెప్పుకునేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి అందరి ఎదుట అనవసరంగా తిట్టడంతో క్షణికావేశానికి లోనైన తిరుపాలు గడ్డపారతో ఆంజనేయులుపై తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులను కుటుంబసభ్యులు అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య సేవలందేలోపు ఆయన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కమ్మూరుకు వెళ్లి విచారించారు. మృతుని భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

గార్లదిన్నె: స్థానిక నారాయణ పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ కోసం వచ్చిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. వివరాలు.... కళ్యాణదుర్గం మండలం కామక్కపల్లికి చెందిన సంధ్య కళ్యాణదుర్గంలోని నారాయణ పాఠశాలలో ప్రైవేట్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఈ క్రమంలో ఉపాధ్యాయ శిక్షణలో భాగంగా గత నెల 18 నుంచి 28 తేదీ వరకు గార్లదిన్నెలోని నారాయణ పాఠశాలలో శిక్షణ కోసం వచ్చిన ఆమె అనంతరం ఇంటికి వెళ్లింది. అయితే ఆమె ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు కళ్యాణదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై 0 ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేసిన కళ్యాణదుర్గం పోలీసులు కేసును గార్లదిన్నె పోలీసులకు రెఫర్ చేశారు.

గుట్టు రట్టవుతోంది!

- వ్యక్తిగత గోప్యతకు పెను సవాల్‌గా మారిన స్మార్ట్ ఫోన్ల వినియోగం
- కొంప ముంచుతున్న డిజిటల్ సైకాలజీ
- చూసే వీడియోలు, చేసే పోస్టులతో వినియోగదారుల మానసికస్థితి అంచనా
- ఖాతాదారుల యూఆర్ఎల్స్‌ను అమ్మేస్తున్న బ్లాగర్స్
- సమాచారంతోనే రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

అనంతపురం: అప్రమత్తంగా లేకుంటే అనర్థాలే. ఓ వ్యక్తి నుంచి అతను వాడుతున్న స్మార్ట్‌ఫోన్ తీసుకుని, ఓ పది నిమిషాలు ఆ ఫోన్‌లోని సోషల్ మీడియాలో వచ్చే వీడియోలు చూస్తే సదరు వ్యక్తి ఆలోచనా విధానం, మానసిక స్థితిని ఇట్టే చెప్పేయవచ్చునని పోలీసులు చెబుతున్నారు. స్మార్ట్‌ఫోన్ వినియోగంలో అప్రమత్తంగా లేకుంటే భవిష్యత్తులో ఎన్నో అనర్థాలను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ వినియోగంలో మెలకువలు తెలియని వ్యక్తులు వాటికి దూరంగా ఉండడమే మేలని సూచిస్తున్నారు. లేకుంటే గుట్టుగా ఉన్న వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన అంశాలు ఇట్టే రట్టవుతాయని హెచ్చరిస్తున్నారు.

అల్గారిథమ్‌దే పెత్తనం

స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న ప్రతి వ్యక్తిపై సోషల్ మీడియా అల్గారిథమ్ పెత్తనం చెలాయిస్తోంది. అత్యధికంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫారాల్లో సమయం గడుపుతున్న ప్రజల భద్రతకు ఇది పెను సవాల్‌గా మారింది. సాంకేతికత పెరిగిన ప్రస్తుత రోజుల్లో అత్యధికంగా జరుగుతున్న సైబర్ నేరాలకు సోషల్ మీడియా అల్గారిథమ్ సహాయకారిగా పనిచేస్తోందని పలువురు నిపుణులు చెబుతున్నారు. అంతేకాక స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న వ్యక్తి ఆలోచన సరళి (డిజిటల్ సైకాలజీ)ని ఈ అల్గారిథమ్ పూర్తిగా బట్టబయలు చేస్తోందని హెచ్చరిస్తున్నారు.



ఎలాంటి వాళ్లో పసిగడుతుంది

సోషల్‌మీడియా ప్లాట్‌ఫారాల్లో అత్యధికంగా వినియోగంలో ఉన్న యూ ట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, లింక్డ్ఇన్ తదితర యాప్‌లు వ్యక్తిగత గోప్యతను పూర్తిగా హరిస్తున్నాయి. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్ట్రాగామ్, లింక్డ్ఇన్ పని తీరులో భాగంగా సెర్చ్ ఇంజిన్‌కు అనుసంధానంగా అల్గారిథమ్ మ్యాపింగ్ పనిచేస్తుంది. దీని వెనుక ఎన్నో అనర్థాలు పొంచి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఆయా సోషల్ మీడియా వేదికల ద్వారా ఖాతాదారులు చూసే వీడియోలు, అప్‌లోడ్ చేసే పోస్టులు, చదివే అంశాలు, చేసే లైక్‌లు, షేర్‌లు, చూసే సమయం, చేసే కామెంట్ ఆధారంగా వ్యక్తుల మానసిక స్థితి, ఆలోచన విధానం, అవసరాలు, అవసరం లేని అంశాలు, ఇష్టాలు, అయిష్టాలు, నడక, నడవడిక, చేసే వృత్తి, నిబద్ధత తదితర అంశాలను ఓ ప్రత్యేకమైన మ్యాపింగ్ ద్వారా అల్గారిథమ్ వందకు వంద శాతం పసిగడుతూ ఉంటుంది. వ్యవసాయ సంబంధిత ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలకు కొనసాగించే సెర్చ్‌లు, కామెడీ వీడియోలు, మీమ్స్, వంటలు, అశ్లీల వీడియోలు తదితర అంశాలన్నీ అల్గారిథమ్ ఇచ్చే సమాచారంతోనే స్మార్ట్‌ఫోన్‌లకు చేరుకుంటాయి. దీంతో స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్న వ్యక్తి మానసిక స్థితితో పాటు అతని ఆలోచన విధానాన్ని పూర్తిగా అల్గారిథమ్ గుర్తించేస్తోంది.

సైబర్ నేరాలకు ఆస్కారం

ఇటీవల పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన కొన్ని బ్లాగ్‌లు... వ్యక్తుల సోషల్ మీడియా అకౌంట్‌తోనే వ్యాపారం సాగిస్తున్నాయని సైబర్ పోలీసులు నిర్ధారించారు. వ్యక్తుల మానసిక స్థితి ఆధారంగా ఫిల్టర్ చేసిన సోషల్ మీడియా యూఆర్ఎల్స్ (యూనిఫాం రీసోర్స్ లోకేటర్)ను సైబర్ నేరగాళ్లకు బ్లాగర్లు అడ్డగోలుగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉద్యోగం కోసం వెతికే వ్యక్తుల సమాచారంతో కూడిన యూఆర్ఎల్స్‌ను కొనుగోలు చేసిన సైబర్ నేరగాళ్లు వారి ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ ఖాతా లింక్‌లు పరిశీలిస్తూ ఫేక్ నోటిఫికేషన్లు పంపి ఉద్యోగాల ఆశ చూపి దోపిడీకి తెరలేపుతున్నారు. తక్కువ ధరకే వ్యవసాయ పరికరాలు అమ్మేస్తామని రైతులను, ట్రేడింగ్‌లో లాభాలు చూపిస్తామని ఇన్వెస్టర్‌లను, రుణాలు ఇప్పిస్తామంటూ డబ్బు అవసరం ఉన్న వారిని ప్రలోభాలకు గురి చేసి సొమ్ము దోచేస్తున్నారు. అశ్లీల వీడియోలు చూసే వ్యక్తులను గుర్తించి.. వారికి న్యూడ్ వీడియో కాల్స్ చేసి ఉచ్చులోకి లాగుతున్నారు. ఈ తరహా మోసాల నుంచి బయట పడాలంటే స్మార్ట్ ఫోన్ల వినియోగంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ



మ్యాప్ రీడింగ్‌పై సూచనలిస్తున్న కమాండర్ కల్నల్ ఎన్.రమేష్

కూడేరు: ఎన్‌సీసీ అంటే ఐక్యత, క్రమశిక్షణకు మారు పేరు అని కర్నూలుకు చెందిన ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.రమేష్ అన్నారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న 6వ ఆంధ్ర బెటాలియన్ సీఏటీసీ–1 ఎన్‌సీసీ శిక్షణా తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తల్ సైనిక్‌కు ఎంపికైన క్యాడెట్లకు పలు సూచనలు చేశారు. వారి మ్యాప్ రీడింగ్ సామర్థ్యాన్ని, ఫైరింగ్ నైపుణ్యాన్ని పరిశీలించారు. ఐజీసీ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్‌లో కర్నూలు గ్రూపునకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని క్యాడెట్లకు పిలుపు నిచ్చారు. క్యాడెట్లు ఉండే గదులు, పరిసర ప్రాంతాలను, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం క్యాడెట్లతో సమావేశమై మాట్లాడారు. ఎన్‌సీసీ శిక్షణ పొందడం ద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండర్ కల్నల్ కులకర్ణి, సుబేదార్ మేజర్ బల్బీర్‌సింగ్, ఎన్‌సీసీ అధికారులు ఏఎన్‌ఓ లెఫ్టినెంట్లు బాలకృష్ణ, మల్లేష్, అమరేష్, 28వ ఆంధ్రా బెటాలియన్ బాయ్స్ కర్నూలు ఎన్‌సీసీ ఇన్‌స్పెక్టర్ శ్యాం కుమార్, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన క్యాడెట్లు పాల్గొన్నారు.

కోటంక క్షేత్రంలో చోరీ కేసు ఛేదింపు

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- 16.261 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వెండి సామగ్రిని పరిశీలిస్తున్న డీఎస్పీ శివారెడ్డి

పట్టుబడింది వీరే...

పేరు	ఊరు	మండలం	జిల్లా
సి.పవన్‌కుమార్	తురకలపట్నం	రొద్దం	శ్రీసత్యసాయి జిల్లా
ఆవుల రాము అలియాస్ ఎరికల రాము	ఎంఎంఎస్ తండా	సీకేదిన్నె	వైఎస్సార్ జిల్లా
వెంకటరమణ	కొత్తమదరమ్	ఒంటిమిట్ట	వైఎస్సార్ జిల్లా
ఈ.శ్రీనివాసులు	బాలకృష్ణనగర్	కడప	వైఎస్సార్ జిల్లా

అనంతపురం: గార్లదిన్నె మండలం కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రంలో చోటు చేసుకున్న చోరీ కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. నలుగురు సభ్యులుగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి, చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి వెల్లడించారు.

చోరీ చేశారిలా...

ప్రసిద్ధ కోటంక కొండలోని గుంటి సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఈ నెల 20న అర్ధరాత్రి దుండగులు చొరబడి 16 కేజీల వెండి ఆభరణాలు, 8 తులాల బంగారు ఆభరణాలు , రెండు హుండీలను పగులగొట్టి రూ.15 వేలు నగదును అపహరించుకెళ్లిన విషయం తెలిసిందే. అదే రోజు రాత్రి 7.30 గంటలు పూజాదికాలు ముగించుకున్న తర్వాత ఆలయానికి తాళం వేసి అర్చకులు ఇళ్లకు వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తాళాలు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు నాలుగు హుండీల్లో రెండు పగులగొట్టి భక్తులు సమర్పించిన నగదు, కానుకలతో పాటు గర్భగుడికి కన్నం వేసి బీరువాలోని వెండి, బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్‌డిస్క్‌ను సైతం ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆలయ కమిటీ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న ఈఓ బాబు ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. స్నిఫ్పర్ డాగ్‌ను రంగంలో దించారు. క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించారు.

స్వాధీనం చేసుకున్నవి ఇవే...

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలవిరాట్‌కు అలంకరించే రూ.13 లక్షల విలువైన 16.261 కిలోల వెండి ఆభరణాలు, అమ్మవార్ల మెడలో అలంకరించే నాలుగు బంగారు తాళిబొట్లు, రూ.2,500 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నేరానికి ఉపయోగించిన ఇనుప రాడ్, కట్టర్, కటింగ్ ప్లేయర్, క్యాటర్ బాల్, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కేవలం ఐదు రోజుల్లోనే...

ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి నేతృత్వంలో శింగనమల సీఐ శ్రీధర్, సీసీఎస్ సీఐ ఇస్మాయిల్, గార్లదిన్నె ఎస్ఐ గౌస్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. క్లూస్‌టీం సేకరించిన వేలి ముద్రల ఆధారంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులు ఎవరైంది ఇట్టే పసిగట్టేశారు. గుడి పరిసరాల్లో వినియోగించిన ఫోన్ నెంబర్లు, కాల్ డేటా తదితర అంశాల ఆధారంగా కేవలం ఐదు రోజుల్లోనే నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ప్రధాన నిందితుడైన సి.పవన్‌కుమార్ కర్ణాటకలోని కోలారు, కొరటగేరి, పట్టణాయక్ హళ్లి, వైఎస్సార్ జిల్లా లింగాల, సిద్దవటం పోలీసు స్టేషన్ల పరిధిలోని పలు ఆలయాల్లో జరిగిన చోరీల్లో కీలక నిందితుడిగా గుర్తించారు. అలాగే ఆవుల రాముపై ప్రకాశం జిల్లా మద్రిపాడు పోలీసు స్టేషన్‌లో గంజాయి కేసు ఉంది. ఐదు రోజుల్లో కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన సీఐలు శ్రీధర్, ఇస్మాయిల్, ఎస్ఐ మహమ్మద్‌గౌస్, హెడ్‌కానిస్టేబుల్ ఫిరోజ్, సిబ్బంది ఎం.దివాకర్, ప్రసాద్, దేవ్లా నాయక్, చంద్రశేఖర్, శ్రీధర్ పాణి, మల్లికార్జున, శ్రీనివాసులు, రంజిత్‌కుమార్, బాలకృష్ణను ఎస్పీ గౌతమిశాలి ప్రత్యేకంగా అభినందించారు.

పేదల గృహ నిర్మాణాలపై నిందలా?

- ఇప్పటికైనా పద్ధతి మార్చుకోండి
- ఎల్లోమీడియాకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హితవు



మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: 'రూ.1.80 లక్షలకు 272 చదరపు అడుగుల ఇంటిని నిర్మిస్తామని దేశంలో ఎవరూ చెప్పి ఉండరు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలోనూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు లక్షల మందికి పక్కా గృహాలు కట్టిస్తామని హామీ ఇచ్చారు. అదే స్ఫూర్తితో నా వంతుగా నిపుణుల సహకారం తీసుకుని అదే మొత్తానికి పేదల గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టాం. ఈ నిర్మాణాలపై ఎల్లో మీడియా ఆరోపణలు చేస్తూ కథనాలు ప్రచురించడం సరికాదు' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అనంతపురంలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు అసత్య కథనాలు ప్రచురిస్తున్నాయని మండిపడ్డారు. పథకంలో భాగంగా లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన బిల్లులను ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన రాక్రీట్ సంస్థకు వారు చెల్లించిన తర్వాతనే ఆయా దశల పనులు పూర్తి చేస్తూ వచ్చిందని వివరించారు. బిల్లులు ఆలస్యం కావడంతో లబ్ధిదారులు సదరు సంస్థకు డబ్బులు చెల్లించలేదు. అనంతపురంలో రూ.6 కోట్ల బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. ఈ కారణంగా పనులు ఆగిపోయాయి. అంతే కానీ అనవసరంగా సంస్థ గురించి వ్యతిరేక ప్రచారం చేయడం తగదు. దీనివల్ల లబ్ధిదారులు నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ బకాయి బిల్లులు ఇప్పించగలిగితే వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయిస్తాం.' అని అన్నారు.

కనీసం ఆలోచించాలి కదా?

రూ.600తో చదరపు అడుగు చొప్పున నిర్మిస్తున్న గృహ నిర్మాణాలకు సంబంధించి సిమెంట్, ఐరన్ వాడుకున్నారంటూ ఎత్తి చూపిస్తున్న వారికి అమరావతిలో చదరపు అడుగు రూ.10 వేలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. అసత్యాన్ని ప్రచారం చేసేటప్పుడు కాస్త ఆలోచించాలని హితవు పలికారు. పనులు ఆగేలా చేసి పేదలకు నష్టం కల్గించే విధానం మంచి పద్ధతి కాదన్నారు. నమ్మి ఓట్లేసిన ప్రజలకు మంచి పనులు చేయాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు జిల్లా మంత్రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలన్నారు. ప్రజలకు మంచి చేస్తే స్వాగతిస్తామన్నారు. హంద్రీ–నీవా కోటా నుంచి చిత్తూరు జిల్లాకు ఇవ్వాల్సిన 11.5 టీఎంసీ నీటిని గాలేరు–నగరి నుంచి ఇచ్చేలా అప్పటి సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నాని గుర్తు చేశారు. రూపాయి ఖర్చు లేకుండా ఆ 11.5 టీఎంసీల నీళ్ల మన జిల్లాకు సాధించుకున్నామన్నారు. ఇందుకు సంబంధించిన జీఓ తెప్పించాల్సిన బాధ్యత మంత్రి కేశవ్‌పై ఉందన్నారు.

మీ ప్రభుత్వమే కదా నిరూపించండి

అమ్మ డెయిరీ ఏర్పాటులో మహిళల నుంచి డబ్బు వసూలు చేసినట్లుగా గతంలో పరిటాల సునీత తనపై ఆరోపణలు చేశారని, ప్రస్తుతం ఆమెనే నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్నారని, అందులోనూ ప్రభుత్వం కూడా వారిదే కావడంతో ఈ వ్యవహారంపై విచారణ చేయించి ఎవరితో డబ్బు వసూలు చేశానో నిరూపించాలన్నారు. అనవసర మాటలు మానుకుని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు.

'హరిత అనంత'గా తీర్చిదిద్దాలి



మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాను 'హరిత అనంత'గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెలలో 100 కిలోమీటర్ల మేర లక్ష మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. నగరంలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రతి మైదానం, వీధుల్లో మొక్కల పెంపకం జరుగుతుందన్నారు. విశేషంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా దత్తత ఇస్తామన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ... నగర ప్రజలంతా బాధ్యత తీసుకొని మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ మేఘ స్వరూప్, అడిషినల్ కమిషనర్ శ్రీహరిబాబు, హార్టికల్చర్ ఏడీ లక్ష్మీప్రసన్న, డీవీఈఓ వెంకటరమణనాయక్, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, లెక్చరర్లు పాల్గొన్నారు.

● పచ్చదనం మధ్య మోడుబారి



ఎటు చూసినా పచ్చని తోటలతో ఆహ్లాదకరంగా ఉండే ప్రాంతమది. మధ్యలో మోడువారిన చెట్టు... అటుగా వెళుతున్న వారి దృష్టిని ఆకర్షిస్తోంది. బత్తలపల్లి మండలం సంజీవపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఈ దృశ్యం కనిపిస్తోంది. ఈ భారీ వృక్షం ఎందుకిలా మారిందో తేలాల్సి ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

సెంట్రల్ వర్సిటీలో పచ్చదనం పెంపునకు చర్యలు

అనంతపురం: నూతనంగా నిర్మించిన సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో పచ్చదనం పెంపుదలకు చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖాధికారి వినీత్ కుమార్‌అన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో అటవీశాఖ సహకారంతో మొక్కల పెంపకాన్ని చేపట్టామన్నారు. సెంట్రల్ వర్సిటీని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ నర్సరీల నుంచి మొక్కలు అందజేసి, సెంట్రల్ యూనివర్సిటీ ఆవరణను హరితవనంగా మారుస్తామన్నారు. జీవ వైవిధ్యం మెరుగుపడే రీతిలో విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్లు, సామాజిక అటవీశాఖ రేంజ్ అధికారి పాల్గొన్నారు.

పాడి, పునరుత్పత్తి పెంపే లక్ష్యం

- వచ్చే నెల 26 వరకూ అన్ని మండలాల్లో గైనిక్ శిబిరాలు
- పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం



పశువైద్య శిబిరంలో టీకాలు వేస్తున్న పశుశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం

అనంతపురం అగ్రికల్చర్: పాడి అభివృద్ధి, పశువుల పునరుత్పత్తి పెంపు, జీవాల సంరక్షణ లక్ష్యంగా ప్రతి మండలంలో పశువైద్య శిబిరాలు (గైనిక్ క్యాంపు) ఏర్పాటు చేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్రీయ గోకుల మిషన్ (ఆర్‌జీఎం) పథకం కింద చేపట్టిన శిబిరాలకు అవసరమైన మందులు, ఇతర సామగ్రి కోసం ఉమ్మడి జిల్లాకు రూ.21.60 లక్షల బడ్జెట్ కేటాయించారన్నారు. ఈ లెక్కన ఒక్కో శిబిరానికి రూ.34,285లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కళ్యాణదుర్గం మండలం దుద్దుకుంట గ్రామంలో ఈ నెల 18న మొదలైన పశువైద్య శిబిరాలు జూలై 26న యల్లనూరు మండలం మేడికుర్తి గ్రామంలో జరిగే శిబిరంతో ముగుస్తాయన్నారు. నాలుగైదు మాత్రమే మండల కేంద్రాల్లో ఏర్పాటు చేస్తుండగా మిగిలినవన్నీ పల్లెలకు అనువుగా ఉన్న ఓ గ్రామంలో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇప్పటికే కళ్యాణదుర్గం, కణేకల్లు, బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట, రాయదుర్గం, డి.హీరేహాళ్, కంబదూరు, బొమ్మనహాళ్, బెళుగుప్ప, వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లో పశువైద్య శిబిరాల నిర్వహణ పూర్తయిందన్నారు. గురువారం ఉదయం వజ్రకరూరు మండలం రాగులపాడు, సాయంత్రం ఉరవకొండ మండలం షేక్షానుపల్లిలో ఉంటాయన్నారు. ఈ నెల 28న శెట్టూరు మండలం పెరుగుపాలెం, 29న కుందుర్పి మండలం వెంకటంపల్లి, జూలై 1న అనంతపురం రూరల్ మండలం మన్నీల, 2న కూడేరు మండలం కొర్రకోడు, 3న నార్పల, 4న రాప్తాడు మండలం ఎంబీ పల్లి, 8న ఆత్మకూరు మండలం తోపుదుర్తి, 9న బీకేఎస్ మండలం అమ్మవారిపేట, 10న గార్లదిన్నె మండలం పి.కొత్తపల్లి, 11న గుత్తి మండలం అబ్బేదొడ్డి, 12న శింగనమల మండలం రాచేపల్లి, 18న పామిడి మండలం రామగిరి, 19న పెద్దవడుగూరు మండలం కదదరకుంట, 22న పెద్దపప్పూరు మండలం జూటూరు, 23న యాడికి, 24న తాడిపత్రి మండలం బొందలదిన్నె, 25న పుట్లూరు మండలం చింతకుంట, 26న యల్లనూరు మండలం మేడికుర్తి గ్రామాల్లో శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు, కాపర్లు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా కృత్రిమ గర్భోత్పత్తి, అంటువ్యాధులు, సీజనల్ వ్యాధుల నివారణ, పశుపోషణ, పాడి పెంపు మెలకువలు, దూడల పెంపకంలో జాగ్రత్తలు తదితర వాటికి సంబంధించి సలహాలు, వైద్య చికిత్స ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా బాబా మందిర వార్షికోత్సవం



పూజలందుకున్న షిరిడీ సాయినాథుడు

అనంతపురం కల్చరల్: సాయినాథ్ మహా రాజ్ కీ జై .. అంటూ భక్తుల నామస్మరణ నడుమ బాబా మందిర వార్షికోత్సవ వేడుకలు కమనీయంగా జరిగాయి. స్థానిక మారుతీ నగర్‌లోని రామాలయ ప్రాంగణంలో బుధవారం సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠను రుత్వికులు సంప్రదాయసిద్ధంగా జరిపించారు. ఉదయం బాబాకు అభిషేకం, విశేష అలంకార సేవలు, సామూహిక భజనలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన వితరణ పెద్ద ఎత్తున చేపట్టారు. సాయంత్రం వందలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామిని పల్లకీలో పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం బాబాకు పునఃపూజలు, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు మాట్లాడుతూ.. 13 ఏళ్ల కిందట సాయినాథుడి ప్రతిష్ఠ ఆలయంలో అంగరంగ వైభవంగా జరిగిందన్నారు. అప్పటి నుంచి షిరిడి క్షేత్రంలో సాగే ప్రతి కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ర్యాగింగ్ వద్దు.. స్నేహమే ముద్దు

అనంతపురం టవర్‌క్లాక్: గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులను ర్యాగింగ్ చేయవద్దు. ర్యాగింగ్ వద్దు–స్నేహమే ముద్దు అని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల నుంచి చదువుల కోసం జిల్లాకు వచ్చిన విద్యార్థులను ర్యాగింగ్ పేరుతో ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్‌కు ఏ ఒక్క విద్యార్థి బలి కాకూడదన్నారు. అలాగే విద్యార్థి తల్లిదండ్రులు కూడా వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. క్యాక్రమంలో సాకే నరసింహులు, గణేష్, యువరాజు, అరవింద్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాలకు ఈ-కేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత

ఆత్మకూరు: మండలంలోని రైతులు తమ బ్యాంక్ ఖాతాలకు తప్పనిసరిగా ఈ–కేవైసీ, ఆధార్ లింక్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుచరిత, ఏఈఓ సుజిత తెలియజేశారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు 2022 సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం ఈ–కేవైసీని తప్పనిసరి చేసిందన్నారు. ఆధార్‌కార్డును మాత్రమే బ్యాంక్ ఖాతాలకు లింక్ చేసుకుంటేనే రైతులకు ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలియజేశారు. అంతేకాకుండా మండలంలోని రైతులందరూ సీసీఆర్సీ కార్డుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. సాగు భూమి లేని కౌలు రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. కౌలు రైతులు సంబంధిత వీఆర్వోలు, రైతు భరోసా సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్డు ఉండటం వలన ప్రభుత్వం నుంచి వ్యవసాయ శాఖ ద్వారా అందించే పథకాలు కౌలు రైతులకు అందుతాయని తెలియజేశారు. అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

మార్కెట్‌లోకి బజాజ్ ఎలక్ట్రిక్ ఆటోలు



వాహనాలను ప్రారంభిస్తున్న డీటీసీ వీర్రాజు

అనంతపురం సెంట్రల్: నగర శివారులోని రుద్రంపేట బైపాస్ సమీపంలో యోగనందీ మోటార్స్ షోరూంలో బజాజ్ ఆటో ఎలక్ట్రిక్ వాహనాలను మార్కెట్‌లోకి విడుదల చేశారు. బుధవారం ఉప రవాణా కమిషనర్ వీర్రాజు చేతుల మీదుగా వాహనాలను ఆవిష్కరించారు. ప్యాసింజర్, కార్గో రెండు మోడల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డీలర్ సుదర్శన్ రెడ్డి, మనోహర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు కార్తికేయన్, చంద్రశేఖర్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యం



అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో రాప్తాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



చెన్నేకొత్తపల్లి: న్యామద్దెల సర్కిల్‌లో డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు

అనంతపురం ఎడ్యుకేషన్: మత్తుకు బానిసైతే జీవితం బుగ్గిపాలవుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎల్లయ్య అన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలపై ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, సెబ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ ఎల్లయ్య మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో మాదకద్రవ్యాలకు యువత ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో మాదక ద్రవ్యాలు ఏ రూపంలో లభిస్తున్నాయి? వాటికి అలవాటు పడిన వారి ప్రవర్తన ఏ విధంగా ఉంటుంది? ఆరోగ్యంపై కలిగే ప్రభావాలను తెలియజేశారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ సరస్వతి, ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ ఎం.బాలాజీ నాయక్, శ్రీనివాసులు, డాక్టర్ డి.జయలక్ష్మి పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో అనర్థాలు

చెన్నేకొత్తపల్లి: ప్రస్తుతం యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని సెబ్ సీఐ లలితాదేవి అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మోడల్‌స్కూల్ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ స్థానిక న్యామద్దెల సర్కిల్ వరకూ కొనసాగింది. అనంతరం అక్కడే విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగాలని ఆకాంక్షించారు. పుట్టిన గ్రామానికి మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాప్తాడులో ర్యాలీ

రాప్తాడు: మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు చోటు చేసుకుంటాయి. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో పోలీసులు, విద్యార్థులతో కలిసి అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వినియోగించే వారిలో అధికంగా యువత ఉండటం ఆందోళనకరమన్నారు. మత్తు పదార్థాల వ్యాపారం చేసే వారిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నిందితులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్ వాడితే జ్ఞాపక శక్తి నశించిపోతుందన్నారు. శారీరక రుగ్మతలు తలెత్తుతాయని తెలిపారు. మత్తు పదార్థాలకు, వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. అనంతరం డ్రగ్స్‌ను అరికడతామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతావాణి, తహసీల్దార్ సీతారామ్, ఎంఈఓ మల్లికార్జున, రాప్తాడు సీఐ మునిస్వామి, ఏఎస్ఐ శ్రీరాం నాయక్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో మాట్లాడుతున్న సెబ్ సీఐ ఎల్లయ్య

6న లైటింగ్ డెకరేషన్, పూల అలంకరణ హక్కులకు వేలం

అనంతపురం కల్చరల్: ఎండోమెంట్ పరిధిలోని మొదటి రోడ్డు శివాలయం అభివృద్ధిలో భాగంగా లైటింగ్ డెకరేషన్, పూల అలంకరణ తదితర వాటిపై హక్కుల కోసం జూలై 6న ఆలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ సాకే రమేష్‌బాబు తెలిపారు. బుధవారం ఆలయంలో జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం ప్రాంగణంలోని మల్టి ఫంక్షన్ హాలు, కల్యాణ మండపంతో పాటు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు సప్లయర్స్ సామాను బాడుగకు ఇచ్చేందుకు ఉదయం 10:30 గంటలకు వేలం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు అధికారులను సంప్రదించాలని కోరారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లోని జన్మభూమి నగర్, కక్కలపల్లి, కాటిగానికాల్వ, బుక్కచెర్ల, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి, వరిమడుగు, పాలచెర్ల, భోగినేపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు గురువారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈనెల 26వ తేదీ వరకు ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న వారికి పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554-286777 (భారత్ గ్యాస్), 08554 246199 (హాసిని ఇండేన్ పవన్ గ్యాస్), 08554-228789 (హనుమాన్ హెచ్‌పీ గ్యాస్)లో సంప్రదించవచ్చు.

బైక్‌లో ఫాలో అవుతూ చైన్ స్నాచింగ్

- మహిళ మెడలో చైన్ లాక్కెళ్లిన దొంగ
- అనంతపురం నగర శివారులో ఘటన

రాప్తాడురూరల్: బైక్‌లో వెళ్తున్న మహిళను అనుసరిస్తూ వచ్చిన ఓ దొంగ సదరు మహిళ మెడలో నుంచి బంగారు చైన్, నల్లపూసల దండను లాక్కొని ఉడాయించాడు. ఈ ఘటన బుధవారం రాత్రి 8 గంటల సమయంలో అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బళ్లారి రోడ్డు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. సంజీవరెడ్డి, సుభద్రమ్మ దంపతులు ఎస్టేట్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ ప్రభుత్వ టీచర్లే. బుధవారం స్కూల్ నుంచి వచ్చిన అనంతరం ఇంట్లో సరుకుల కోసమని ఇద్దరూ నగరంలోకి వెళ్లారు. సుమారు 7:30 సమయంలో భర్త సంజీవరెడ్డి చిన్న పని చూసుకుని వస్తానని చెప్పి టవర్‌క్లాక్ వద్ద ఆగిపోయాడు. అక్కడి నుంచి సుభద్రమ్మ స్కూటీలో సరుకులు పెట్టుకుని ఇంటికి బయలు దేరింది. మరి ఎక్కడి నుంచి గమనిస్తూ వచ్చాడో తెలియదు కాని సుభద్రమ్మ సరిగ్గా ఎస్టేట్ వద్దకు రాగానే.. వెనుక నుంచి మరో బైక్‌లో వస్తున్న దొంగ ఒక్కసారిగా ఆమె దగ్గరగా వచ్చాడు. మెడపై చేయి చేసి చైన్, నల్లపూసల దండను లాక్కొని కూడేరు వైపు ఉడాయించాడు. ఈ హఠాత్పరిణామం నుంచి వెంటనే తేరుకున్న సుభద్రమ్మ దొంగ బైక్‌ను కాస్తా దూరం వరకూ ఫాలో అయింది. గట్టిగా కేకలు వేస్తూ.. దొంగ దొంగ అని అరుచుకుంటూ కాస్త దూరం వెళ్లింది. అప్పటికే దొంగ వేగం పెంచేసి వెళ్లిపోయాడు. దొంగ గ్రీన్ కలర్ చొక్కా ధరించాడని బాధితురాలు చెబుతోంది. సమాచారం అందుకున్న రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తన సిబ్బందితో కలసి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రెండు బృందాలను నియమించి గాలింపు చర్యలు చేపట్టారు. కాగా అంతకుముందే పాతూరు చెరువుకట్ట మీద ఇదే విధంగా బైక్‌లో వచ్చిన దొంగ ఓ మహిళ మెడలో బంగారు చైను లాక్కొని పోయాడు. ఆ ఘటన బాధితురాలు కూడా గ్రీన్ కలర్ చొక్కా ధరించాడని పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. ఈ రెండు ఘటనల్లోనూ ఒకే దొంగ పాత్ర ఉంటుందనే కోణంలో పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు వేగవంతం చేస్తామని సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

డయేరియా వ్యాప్తిని అరికట్టాలి



రాప్తాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రాప్తాడు: డయోరియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ గీతావాణి, తహసీల్దార్ సీతారాం, వైద్యాధికారి శివకృష్ణ పేర్కొన్నారు. బుధవారం డయోరియా వ్యాధి నియంత్రణకు మండలా స్థాయి అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా డయోరియా పేషెంట్లు ఉంటే ఓఆర్ఎస్ ద్రావణం , నిర్దేశించిన మోతాదులో 14 రోజుల జింక్ మాత్రలు సరఫరా చేయాలన్నారు. సీజనల్ వ్యాధి అయిన డయేరియా రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో అన్ని గ్రామాల ప్రజలు తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో దోమలు, ఈగలు దరిచేరకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీరు, క్లోరినేషన్ చేయబడిన నీటినే తాగాలని సూచించారు. బయటి ఆహార పదార్థాలు తినకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ మునిస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, ఎంఈఓ మల్లికార్జున, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, ఏపీఎం నల్లప్ప, సీహెచ్ఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోంగోడిబి సర్టిఫికేషన్‌లో ఎస్ఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికేషన్ విడుదల చేస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు మోంగోడిబి సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో ప్రతిభ కనబర్చినట్లు కళాశాల కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి బుధవారం తెలిపారు. విద్యార్థులు ఆధునిక డేటాబేస్ మేనేజ్‌మెంట్‌లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు. మోంగోడిబి ఎస్ఆర్ఐటీ కళాశాలలో కెరీర్ కోసం విద్యార్థులను సిద్ధం చేయడానికి విలువైన భాగస్వామిగా గుర్తించిందన్నారు. ఈ భాగస్వామ్యం దాని పాఠ్యాంశాల్లో పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను ఏకీకృతం చేయడానికి అంకిత భావాన్ని హైలెట్ చేస్తుందన్నారు. తమ కళాశాల విద్యార్థులు మోంగోడిబి సర్టిఫికేషన్‌లో విజయం సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థుల అంకిత భావం, నైపుణ్యాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అగ్రశ్రేణి విద్యను అందించడంలో తమ నిబద్ధతను ప్రతిబింబిస్తాయన్నారు. కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ మోంగోడిబి నుంచి వచ్చిన ఈ గుర్తింపు తమ విద్యార్థుల విజయవంతమైన కెరీర్లను సిద్ధం చేయడానికి ప్రయత్నాలను పునరుద్ఘాటిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్, వీర ప్రకాష్, డాక్టర్ చిత్ర లింగప్ప, కొండన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి



ముష్టికోవెలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ-2 ప్రసన్నకుమార్

చెన్నేకొత్తపల్లి: పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని చెన్నేకొత్తపల్లి ఎంఈఓ–2 ప్రసన్నకుమార్ నాయుడు సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిధిలోని న్యామద్దెల, ముష్టికోవెల గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. అలాగే పాఠశాలల్లో కొత్త అడ్మిషన్లు ఎలా జరుగుతున్నాయని అక్కడి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు, పరసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. భోజనం నాణ్యత, మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఆర్పీ నరసింహులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

- డీపీటీఓ మధుసూదన్

అనంతపురం క్రైం: ఆర్టీసీ అభివృద్ధితో పాటు ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని డ్రైవర్లకు శ్రీసత్యసాయి జిల్లా ప్రజారవాణా అధికారి టి.మధుసూదన్ సూచించారు. అనంతపురంలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన డ్రైవర్ల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. డ్రైవరు వృత్తి అనేది కత్తిమీద సాములాంటిదన్నారు. ఒక్క డ్రైవరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలిగే నష్టం ఎన్నటికీ పూడ్చలేనిదన్నారు. నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే క్రమంలో డ్రైవర్లు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సి వస్తుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి వ్యాయామం, పౌష్టికాహారంతో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ఆర్టీసీ పంచసూత్రాలను పాటిస్తూ మంచి నడవడికతో సంస్థ అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు.

పది సప్లిలో జిల్లాకు 17వ స్థానం

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు బుధవారం సాయంత్రం విడుదలయ్యాయి. 62.36 శాతం ఉత్తీర్ణతతో అనంతపురం జిల్లా రాష్ట్రంలో 17వ స్థానంలో నిలిచింది. జిల్లాలో 7,784 మందికి గాను 4,854 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 5,033 మంది బాలురకు గాను 60.42 శాతంతో 3,011 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే 2,751 మంది బాలికలకు గాను 65.09 శాతంతో 1,813 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 10 వరకూ జరిగాయి.

టీడీపీ నేతల అరెస్ట్

బుక్కరాయసముద్రం: కొర్రపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేసిన టీడీపీకి చెందిన ఎంపీటీసీ ఎర్రినాగమ్మ భర్త ఆదినారాయణ, పార్థసారథి, బద్రిలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై 323, 324, 307, రెడ్ విత్-34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితులని కోర్టుకు హాజరుపర్చగా జడ్జి వారికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

పండ్లతోటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం: ఉపాధి హామీ పథకం కింద 2024–25 సంవత్సరానికి సంబంధించి పండ్ల తోటల సాగుకు రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఓ పోలేరయ్య తెలిపారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద చీనీ, మామిడి, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, దానిమ్మ, నేరేడు, సీతాఫలం వంటి పంట సాగుకు ప్రోత్సాహకం కల్పిస్తున్నామన్నారు. 5 ఎకరాల లోపు పొలం ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులు అన్నారు. మండల రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధి కూలీల హాజరు పెంచండి



మాట్లాడుతున్న ఏపీఓ షబ్బీర్‌బాషా

యల్లనూరు: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులకు కూలీల హాజరుసంఖ్య పెంచాలని ఏపీఓ షబ్బీర్‌బాషా సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ విధిగా మస్టరు తనిఖీ చేయాలన్నారు. అలాగే హౌసింగ్ 90 రోజులు, పండ్లమొక్కల పెంపకంపై రైతులకు అవగాహన కల్గించాలన్నారు. పాత, కొత్త పనులపై సమీక్షించారు. టెక్నికల్ అసిస్టెంట్లు జయరాం, శంకర్, అదిల్, శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యాన్ని దుర్వినియోగం చేస్తున్నారు'



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

అనంతపురం కల్చరల్: రాజ్యాంగాన్ని మార్చకపోయినా కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజాస్వామ్యం దుర్వినియోగమవుతోందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. బుధవారం సాయంత్రం జేవీవీ కార్యాలయంలో సమాలోచన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ కన్వీనర్లు వ్యవహరించిన సూర్యచంద్ర, సతీష్‌తో పాటూ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, రాజ్‌మోహన్, సీపీఎం నాయకులు రాంభూపాల్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ఎం బాషా, డాక్టర్ ప్రసూన, డాక్టర్ రామభద్రయ్య తదితరులు మాట్లాడారు. సమావేశంలో 'ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం ఎలా? అంశంపై విస్తృతస్థాయి చర్చ జరిగింది. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. ఎన్నికలు వచ్చాయంటే ప్రజాస్వామ్యం నడివీధిన పడుతూ పరిహాసమవుతోందన్నారు. ఎన్నికలంటే స్వేచ్ఛాయుత వాతావరణం వెళ్లిపోయి విచ్చలవిడిగా డబ్బు కీలక పాత్రపోషిస్తుండటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకారిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పదే పదే రాజ్యాంగాన్ని మార్చాలనడం ఎక్కడి ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. నూటికి 51 శాతం ఓట్లు వచ్చిన వారు అధికారం వెలగబెడుతుంటే కొంత తక్కువ స్థాయిలో మంచి ఓట్లు సంపాదించుకున్న వారిని ఏమి చేయలేని స్థితికి తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు నిజంగా అందరికీ అందుతున్నాయా లేదా అన్నదానిపై ప్రజలతో చర్చించాలన్నారు. నీట్ గురించి చర్చసాగాలన్నారు. విద్యార్థులకు అందరూ మద్దతుగా నిలవాలని తీర్మానించారు. పలువురు వక్తలు ఎన్నికల సజావుగా సాగడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మాట్లాడారు. అంతకు ముందు ఆవాజ్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ముష్కిన్ ఆకస్మిక మృతికి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు జనవిజ్ఞానవేదిక నాయకులు రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, బాబాద్దీన్ పాల్గొన్నారు.

రేషన్ పక్కాగా పంపిణీ చేయాలి



రేషన్ సరుకులను పరిశీలిస్తున్న తహసీల్దార్ పరమేశ్వర స్వామి

ఆత్మకూరు: మండలంలోని రేషన్ తీసుకునే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ పరమేశ్వర స్వామి సూచించారు. బుధవారం స్థానిక రేషన్ సరుకుల గోదామును పరిశీలించారు. లబ్ధిదారులకు అందించే సరుకులు బాగున్నాయా? లేదా అని పరిశీలించారు. రేషన్ సరుకులను తూకం వేసి కొలిచారు. సరుకులు ఎలా ఉన్నాయని అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈనెల కూడా గతంలో మాదిరిగానే రేషన్ పంపిణీ చేయాలని వీఆర్వోలకు సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

నిందితుడికి రిమాండ్

పెనుకొండ: మండలంలోని కొండంపల్లికి చెందిన అక్రమ మద్యం విక్రేత ఎరుకల గంగయ్యకు న్యాయమూర్తి బుధవారం 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ.రాజేష్ తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు... 2020 డిసెంబర్ 31న గంగయ్య కర్ణాటక నుంచి మద్యం తీసుకొస్తుండగా అప్పటి ఎస్ఐ. వెంకటేశ్వర్లు పట్టుకుని అతని నుంచి 48 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయితే అప్పటి నుంచి పరారీలో ఉన్న గంగయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు చెప్పారు.



కమనీయం.. ఖాద్రీశుని కల్యాణోత్సవం

కదిరిటౌన్: శ్రీదేవి, భూదేవి సమేత ఖాద్రీశుని కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. బుధవారం అర్చకులు స్వామి వారిని పలు రకాల పూలతో అలంకరించి పూజలు చేశారు. హోమాలు చేసి, శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛారణల నడుమ అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

గాండ్లపెంట: ద్విచక్రవాహనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎన్‌పీ కుంట మండలం కొండమూల కటకంవారిపల్లికి చెందిన టి.భాస్కర (38) నెల రోజుల తర్వాత మృతి చెందాడు. జమేదార్ తిరుమలరెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. భాస్కర మే 25న కదిరి నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వస్తుండగా గాండ్లపెంట సమీపంలోని పెద్ద మిట్ట వద్ద కుక్కలు అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలవడంతో కదిరి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడి నుంచి అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా… పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. భార్య రోజా ఫిర్యాదు మేరకు జమేదార్ కేసు నమోదు చేశారు.

నేడు సాయిబాబా ఆలయంలో పూజలు

రాప్తాడు: స్థానిక షిరిడి సాయిబాబ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పూజారి క్రిష్ణమూర్తి తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.